# యుద్ధం

ఇస్కూల్లంట మజ్జేన్నం బువ్వలు మానీసినపుడుకాంచి - నేను బడి మానీసినాను. అప్పుడికి నాకు అచ్చురాలన్నీ యెలిపోవొచ్చును. కా గుణింతమూ వొచ్చును. సిన్న, సిన్న పేర్లు ...... సదివీసోడ్ని కూడబలుక్కోని. సాల్దా ? సాల్దట " ఎద్దు నాగున్నావు, నాలుగె క్లాసు కెలి పోవొచ్చినా వేటీ రావు ..... ఎదవకానా " అని మా సెలేను మేస్ట్రుగోరు తిట్టీవోరు. అతగాని తిట్లు పడనేక - యిస్కూలు మానిద్దుమనుండీది. మజ్జేనం బువ్వ నాగీసీది బడికి నన్ను.

సేలేను మేస్ట్రుగోరు ... వారం కొక రోజొస్తారు. అసలకి, మా బడికి అయిదు కలాసులికి అయిదుగురు మేస్టర్లున్నే - అందరొకపాలి రారు. రోజు కొకలే వొత్తారు. మమ్మల్ని మంద ఆసెత్తారు. ఒక మేస్ట్రుగోరు .... పెసిరెంటు గోరికి పేపరు భోగట్టాలు సదివినిపిత్తారు. ఉంకో మేస్ట్రుగోరు - ఆల యూనియన్ పన్లు మీద తిరుగుతారు. మరో మేస్ట్రుగోరు అప్పుయేట కెల్తారు. సెలేను మేస్ట్రుగోరు వొయిద్యానికీ, కుర్రమేస్ట్రు పీర్లేసుకి తిరుగుతారు. రోజు కొకలు మాత్రం కంపల్సరీవుగా యెలిపోవొత్తారు. మా సెలేను మేస్ట్రుగోరొత్తే నాకు యిసారం. సెలేను మేస్ట్రుగోరు సదువుకంటా పన్లెక్కువ సెప్తారు. ।ఒరే సిమాలుగా - సిగరెట్లు పట్రారా "అంతారా ? సిగరెట్లు తెచ్చిత్తానా ? అప్పుడు జోబీల్తడిమీ "అగ్గి పెట్టి లేదురా, అగ్గి పెట్టి పట్రారా అని మళ్ళా పంపుతారు, అలాంటి పన్లుగాక - అతగాను వొయిద్యం సేత్తండు గదా, ఎవులికి యే జబ్బొచ్చినా .... సేలేనెక్కించేత్తాడు. అంది కతగానికి సెలేను మేస్ట్రు గోరంతాము. ఇస్కూలి కొచ్చీముందు - యెవులికో సెలేను తగిలించీసొస్తాడు. అది అయి పోయిందో,ఉందో సూసి ..... రారా ' అని సిటంకోపాలి తగుల్తాడు. మరి సదువెప్పుడవుతాది ? మళ్ళా, యేట్రా దెదవకని తిడతాడు.

అదిగా బడి మానీసి, సావుకారి గోరి ఆవులు కాయడం కమిరిపోరా అని మా యమ్మ అనీది. మా అయ్యలేడు. కాస్టంకాడ ఆడి బుగ్గివున్నాది. ఆడి సావు కర్సు అప్పు మా యమ్మ పీక మీదున్నాది.నాను ఆవులు కాసీ, మా యమ్మ కూల్నాలీ సేసి - ఆ సావుకారి అప్పు తీర్చీయాలని మాయమ్మ ఆలోచన. నాకూ యిస్కూల్ల పనులు, మేస్టర్లు తిట్లు కంటా - ఆవులు కాత్తే బాగున్ను అనిపించీది. సుబ్బరగ మెరకలంట తిరగొచ్చు. సిరతా బిళ్ళా ఆట ఆడొచ్చు. యేటిలో గెంతి, యీత కొట్టొచ్చు .. అనుండేది.

మజ్జేన్నం బువ్వ - నాగీసీది బడికి నన్ను. ఇంటిల గెంజినీలే గదా. మజ్జేన్నం బువ్వ ఆపీసినారు - అప్పుడు బడి మానీసినాను.

బడొగ్గీగాని, సావుకారి ఆవులు కాపలాకి అమిర్చింది మా యమ్మ నన్ను. ఆవులు కాయిడి మనీసరికి సర్దాపడి పోన్ను గాని - మా సావుకారి, పనిమీద పని సెప్పి తినీసీవోడు. ఆవులిప్పకముందు - నూతినీళు తోడమనీవోడు . ఆళ్ళింట్లోని నుయ్యిల నీరు ... పాతాళంలోకుండీది. తిన్న సల్లంది - అరిగి పోయీది.. నీరు తోడీసరికి ! అప్పుడు ఆవులిప్పమనీవోడు. ఆతర్వాత ఇంటిలోని బస్తాలు దుకానంకి, దుకానం కాడివి ఇంటికి మొయ్యించీవోడు. ఇటికీ పున్నమునుంచి మళ్ళా ఇటికీ పున్నందాకా - పళ్ళు బిగువున పన్జేసినాను. ఆడి బాకీ తీరి పోనాది. సావుకారి కాడ పని మానీసినాను.

పెద్దోడ్ని అయిపోనాను గదా ...... మా ఊరి బుగతలు కంబరికం వుంతా వేట్రా అనడిగినారు. నానుండలేదు. పెద్దోడ్ని అయిపోనాను గదా - అన్ని పన్లూ వొచ్చును. మా యమ్మ మాత్తరం - 'సిన్న

గుంటడివే' అంతాదింకా ! యింకా సిన్నగుంటడ్నా?నవ్వరెవులేనా?బడిమానేత్తే పెద్దోలిమయిపోయినట్టగే గదా ? అందుకని, యింటిల వొట్టిన కూకోనుండోడిని గాదు. ఆకుతీతలకీ, పారపనికి, దుక్కులుకీ ....... అన్ని కూలి పన్లుకి ఎల్లి - కూలి తెచ్చి మా యమ్మ కిచ్చోడ్ని ! అప్పుడికీ మాయమ్మ, నేను పెద్దోడ్ని అయినట్టుగ - నమ్మిదికాదు. ఇంకా, సిన్న పిల్లలకి సెప్పిన పన్లే సెప్తాది. ' ఒరే సిమాల - అల్లా అత్తని చేట అడిగి పట్రారా, యిల్లీ సీపురు తెమ్మిరా, కొట్టుకెల్లి - పావలా కిర్సనూనె తేరా '.... యిలాగ సిన్న పిల్లల పన్లు సెప్తాది. పోన్లే - అనుకుని నీనా పన్లన్నీ సేత్తన్ను. మా సెలేను మేస్ట్రుగోరు మాత్రం యీదిలో నెపుడేనా కనపడితే యేట్రోరే సిమాలుగా - బడి మానీ సరికి గెడకెర్ర నాగ పెరిగీసీనావనీవోలు ! నాకు వొల్లు పొంగి పోయేది !

ఈ మద్దిని మా యమ్మకి ఊష్టమొచ్చి మంచం పట్టింది. అప్పుడు మరన్నీటికీ నీనే ఆధారువు. అప్పుడన్నాది మాయమ్మ - మా పొరుగింటి అత్తతోటి ' మా సిమాలు పెద్దోడ్నాగ సంపాదన సేత్తండు - సరిపోనాది గాని. లేపోతే యీ జబ్బుకి నీను మంచం పట్టినందుకు యింటిల దివ్వేనా ఎలగప్పోను" అనేది. మా యమ్మకి ఊష్టం రాగాన, సెలేను మేస్ట్రుగోర్ని పిల్దం కెల్నాను. అతగాను ముందు డబ్బులడిగి, ఆ తర్వాత జబ్బేటన్నాడు. నాల్రోజులు కూలి - రొండ్రోజులు వొయిద్యంకి సాలిందే కాదు . ఎలగయితేటి - నిన్నటి కాంచి మాయమ్మ తిరగాడతంది. గాన్నీరసమొదల్లే. నోరు రుచి పోయి, వచ్చ వచ్చ గుందట ! కందిపప్పు పులుసొండితే బాగున్ను అన్నాదీ పొద్దు. అందికని, కంది పప్పు కొండంకనీ మా సావుకారి దుకానం కాడకెల్నాను. సాయంత్రం పొద్దు గుంకి పోనాది. సీకటి సీకటి గుంది.

సావుకారి కొట్టుల కొరివిలాగ నైటెలుగుతంది. దుకానం దినుసుల డొక్కుల మద్దిని - డొంకల్లోని బవురుపిల్లి నాగున్నాడు సావుకారి. అతగాని ముంగట కాటా - పిల్లి మీసం నాగ యేలబడి వున్నాది. నన్ను సూసి, అతగానే ముందు పలకరించాడు.

" యేందిరో సిమాలో ? యేటి నల్లపూసవయిపోనావు ? " అనడిగాడు. మా సావుకారికి - నామీద గురెక్కువ ! గుంటడినని కూలి తగ్గించొచ్చు - పనెక్కువ సెయ్యించుకోవచ్చు గద - అందుకని. సావుకారి పలకరింపుకి-

"ఈ మద్దిన పొరుగూరు పని కెల్తన్నాను బాబ్. తెల్లారగట్ల యెలిపోయి-మళ్ళరాతిరికే వొత్తన్ను. అందికే అలికిడి నేదు." అన్నాను.

ఆహా, యేపాటి కిడతందిరో కూలి ? మొత్తానికి గుంటడివయినా, గడుసోడివిరా. గడించు, గడించురా సొమ్ము" అన్నాడు. అది ఎకసెక్కెమో,పొగడతో బోద పడ్డేదు నాకు ...... అలగన్నాడు. అప్పుడు-

" మా నాటోలిమేటి గడిత్తాం బాబ్. పూట బత్తిం పుల్లవెలుగోలిమి. దాని మీద జబ్బులు. మా యమ్మకీ మద్దిని ఊష్టం . కూల్డబ్బుల్ని ఆ జబ్బు తినీసింది" అన్నాను.

"అర్రరే ...... ఊష్టమా ? తగ్గిపోనాదా ? డబ్బుల్నేవా ? అప్పు కావాలేటి ?అనిఅడిగాడు. అప్పుయిత్తే - మల్ల నన్ను అమిర్సీవచ్చు గదా ! అప్పుడు నీను - తగ్గిపోనాదినెండి. నోరు రుసినేదంతే కందిపప్పు పులుసొండాలని - పప్పు కొండం కొచ్చాను. " అని సెప్పీ రూపాయిచ్చి, అర్ధపావు కంది పప్పు యిమ్మన్నాను. రూపాయి బిళ్ళందుకోకండా - నవ్వుతండు సావుకారి. ఎప్పుడికీ ఆపడు. యేటీ సావుకారికి - పిచ్చే ? తిపారమా ? అనుకున్ను. అప్పుడు -

"రూపాయికి కందిపప్పు పెసాదంకి సాల్దు -అంతొత్తాది. అర్దపావిచ్చీమనీ సరికి నవ్వొతంద్ది." అన్నాడు.

"యేపీ ? కేజీ యెంత బావ్ ?" అనడిగాను.

"మొన్నటిదాక కేజీ పదిరా. నిన్నటి కాంచి పదారు " అన్నాడు.

"అదేటి ? మొన్నటికి, నిన్నటికీ అంతోటొకపాలెలగ పెరిగిపోద్ది ?" అన్నాను "నీకు తెల్దునేరా " అనేసి మళ్ళా నవ్వుతండు.

"అదర మళ్ళా ..... నవ్వుతాడు" అని ఆశ్చిర్యపోతంతే

"అన్నీటికీ పెరిగిపోనాయిరా ధరలు" అన్నాడు నవ్వు ఆపి.

"ఎందుకు బావ్?" అని కారణమడిగితే

"యుద్ధ మవుతుందిరా ... అందుకూ." అన్నాడు.

"యుద్ధమా ? ఎవులెవులికి బావ్?" అన్నీను అడిగితే -

"నీకు తెల్దురా ....." అని మళ్ళా నవ్వబోనాడు. నాకు మాసెడ్డ కోపమెలిపోవొచ్చీ

"ఈపాలి నవ్వినావంతే - మనిద్దరికి యుద్ధమయిపోద్ది" అన్నాను. అప్పుడు సావుకారీ -

"కప్ప యేటి తింతాదిరా?" అనడిగాడు.

"యేటి తింతాది, పురుగులూ .... సిన్న సిన్న పరిగిలూ" అన్నాను

"ఔనా ?" అని మళ్ళా నా సేత ఔననిపించీ -

"అయితే, మరి పామో?" అనడిగేడు.

"కప్పల్నీ, సేపలూ జెల్లల్నీ తింతా" దన్నాను, అప్పుడు సావుకారీ -

" కప్పకీ, పాముకీ యుద్ధమవుతందిరా " అన్నాడు. అనీ -

" కప్ప కడుపులోని పురుగుని కక్క మంతాది పాము, నువ్వెవుడివి నన్న డగడంకి - ఆ పురుగు నాకడుపుల కలిసి పోనాదంతాది కప్ప.అయితే కాస్కో అని పామూ యుద్ధమాడతన్నాయిరా. అదీ కత" అన్నాడు.

" కతలేటి .. అసల్సంగతి సెబ్దూ"అనంతే -

" అమెరికావోడికున్నూ, యిరాకోడికున్నూ మద్దినిరా " అన్నాడు.

"అయితే ఆళ్లకాళ్లకి యుద్ధమయితే మనకేమి ? మంగ్రలామిడికీ, బారికి సోముడికీ తగువయితే - సాకలి తిప్పడికి నొప్పేలొత్తాదీ ?" అన్నాను.

"అందుకే నీకు తెల్దురా అన్నాను. " అని సావుకారి 'నీకు తెల్దురా' అని అన్దం తప్పుగాదని తేల్చినాడు. తేల్సీసి -

"ఆ యుద్ధంతోటి పెపంచకమంతా పీటముడి పడిపోనాదిరా సరుకులు కదలడంకి .... చమురుసుక్క దొరక్కంటంది. అక్కడ బాంబులు పేల్తన్నాయి. యిక్కడ ధరలు పేల్తన్నాయి. నీనేటి జేసేదీ ?" అన్నాడు.

"ఔను బావ్? ఆ దేశాల కాంచి తేవొల్సిన సరుకంతే రాదూ, కరువయి పోందని .... ధర పెంచీవొచ్చుగానీ : యిక్కడి వుప్పూ,పప్పు కీ పెంచేత్తారా ?" అనడగితే, ఆ సావుకారి మా నిబ్బరంగా -

"మరందుకే అన్నాను నీకు తెల్దురా అని .... " అన్నాడు.

"నిజిమే, నాకేగాదు, నా తోటి వాల్లెవులికీ తెల్దు. తెలిత్తే నీలాటోలు నవ్వగ్రలేటి ?" అన్నాను కోపమొచ్చి. మరన్నా ? అప్పుడు, సావుకారి - "ఒరే ఒక దానికి రేటు పెరిగితే, మరన్నీటికీ పెరగతాయి. యింజిను

తిరిగితే సిన్న సిన్న సెక్రాలూ తిరగవేటి ? అదిగాక - మీమేటి సరదాకి పెంచీసినా మేటి ? సరుకులు దెచ్చీ లారీవోలు - ఆయిలు రేటు పెరిగిందని అద్దిలు పెంచినారు. అదిగాక, కొన్ని సరుకులికి కంపినీవోలు రేట్లు పెంచీసినారు. అయినా, సిల్లర, మల్లర అమ్ముతాం గదా - పర్లేదని పెంచలేదింకా ధరలు. ఇంతలోకి అడివిపందులు సెనగసేని మడిని దువ్వీసినట్టిగ - ఫుడ్ ఆరయ్యి వొకపక్క, యిజిలెన్సోలు యింకోపక్క, మరోడు మరోపక్క ... నాదుకాణాన్ని దువ్వీసి కేసు వ్రాస్సినారు. మరా కర్సులెక్క డ్డిండెట్టాల ?" అని తిరగ పెశ్నేసినాడు- నీనేటి సెప్తాను. ?

" అయితే బావ్ .. ఆ యుద్ధమాగిపోతె - పోని అప్పుడేనా తగ్గుతాయా దరలు" అని అడిగాను. అందుకా సావుకారి 'నీకు తెల్దునేరా' అన్లేదుగానీ, అలగ నవ్వినాడు. నవ్వి, నవ్వీ ..

" పెరిగినోడు ... తరిగి పోగల్డేటిరా ? నువ్వు మల్ల సంటోడివై తల్లి పాలు తాగ్గల వేటి ? " అనడిగీ మళ్లా -

" అయినా, నీ కనుమాన మొద్దు, ఆ యుద్ధమింత బేగి ఆగదు, అదిగాక, యింకా ముదిరితే .. పెపంచ యుద్ధమయిపోద్దాట గూడా" అన్నాడు సరదాగా.

"అయితపుడేటవుతాదీ ?" అని నాను అడిగాను. అనుమాన మొచ్చి.

"యేటవుతాదీ, పెపంచంలోని పెద్ద, పెద్ద మిల్లులూ, పెద్దోలి భవంతులూ, సంపదలూ .. బాంబులు పడి బుగ్గయిపోతాయి " అన్నాడు.

" అలగయితే .. మన దేశంలోని పెద్ద, పెద్దోలి మిల్లులు మీదా, యిళ్లు మీదా, సంపదల మీదా బాంబులు పడతాయన్నమాట" అనుకున్నాను లోపుని ! అనుకునీ -

"అయితే .. రూపాయి కెంత, పప్పోస్తే అంతిచ్చీ సావుకారీ బేగి. కందిపప్పుకాదు పెసరపప్పు ఇయ్యి" అని తొందరజేసాను. రూపాయికి పప్పు, కొలిస్సి, పొట్లం సుట్టి, సేతిలెడుతూ ..

" కాదేట్రా తొందరా ? " అనడిగాడు.

" బేగెల్లీ, యీ పప్పు నానేస్సి, దేముడికి పెసాదమెడతాను .. దేముడా ! మా దేశం మిల్లులు మీదా, సంపదల మీదా బాంబులు పడించీవా అనీ ! మా నోటి కందని సంపదలుంతే యేమి, బుగ్గయితే మాకేమి ? " అనీసరికి .. మా సావుకారి మొకంల నవ్వు మాసిపోనాది. కాటా ఒక పక్క కొరిగిపోనాది !

" ఒరె వెధవకానా .. అవేం ఆలోచన్లురా. ఇంటిలో ఎలుకలున్నాయని, ఇంటిని కాల్చుకుంటామా ? సంపదల మీద బాంబులు పడి బుగ్గయిపోడం కాదు .. ఆ సంపదలు నీలాంటోలికి సెందటంకి ప్రార్ధించురా " అన్నాడు .. ఎప్పుడెలి పోవొచ్చి, మా మాటలిన్నాడో సెలేను మేస్త్రుగోరు !

నేను గతుక్కుమన్నాను. మేస్త్రుగోరు సెప్పిన ముక్క బోదపర్చుకోని, యింటికాసి అడుగు లేసాను .

*(సృజన - ఏప్రియల్ మే 92)*